సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



అంగన్‌వాడీలపై బిల్లుల భారం

అంగన్‌వాడీలపై బిల్లుల భారం పడుతోంది. 2022 నాటి ధరలనే చెల్లిస్తున్నారు.

- IIలో



సమాజ సేవకు నేనుసైతం

నేషనల్ యూత్ వలంటీర్లుగా అవకాశం పిలుస్తోంది. దరఖాస్తులకు నేడే ఆఖరు తేదీ.

- IIలో

ట్రిపుల్ ఐటీకి అరుదైన గౌరవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఐబీఎం క్వాంటం కిస్కిట్ ఫాల్ ఫెస్ట్-2025 కార్యక్రమంలో భాగంగా, ఆంధ్ర ప్రదేశ్‌లో ఏకైక సంస్థగా ఆర్‌జీయూకేటీ (ఐఐఐ టీ) శ్రీకాకుళం ప్రత్యేకంగా ఎంపికైందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ క్విస్కిట్ ఫాల్ ఫెస్ట్ అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరుగుతుందన్నారు.

న్యూస్‌రీల్

హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌కు 32 మంది దరఖాస్తు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన దరఖాస్తులను పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 32 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో పది మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఎచ్చెర్లలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధర్ అభ్యర్థులకు ఉన్న డ్రైవింగ్‌లో వారి నైపుణ్యాన్ని పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పీవీ గంగాధర్, ఆర్టీసీ డిపో - 1 డీఎం అమర సింహులు, ఆర్టీసీ పీఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సత్యవరానికి తాగునీరు



పైపులకు వాల్వ్‌ను అమర్చే పనులను పరిశీలిస్తున్న ఈఓ, వార్డు సభ్యులు

నరసన్నపేట: మేజర్ పంచాయతీ పరిధిలోని సత్యవరానికి ఎట్టకేలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. ట్యాంకు వద్ద మరమ్మతునకు గురైన పైపువాల్వ్‌ను మార్చి మంగళవారం కొత్తవి అమర్చారు. ఈ పనులను ఈఓ ద్రాక్షాయిని పర్యవేక్షించారు. దీంతో సాయంత్రం సత్యవరానికి తాగునీటిని కుళాయిల ద్వారా పంపిణీ చేశారు.

'సమ్మె జయప్రదం చేయండి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. అక్టోబర్ 15 నుంచి జరిగే విద్యుత్ కార్మికుల సమ్మెపై సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ విధానాల నుంచి సంస్థను రక్షించుకోవాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మేధావులంతా విద్యుత్ సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, శ్రీకాకుళం టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాష్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ బయట నిరసన తెలుపుతున్న సీదిరి అప్పలరాజు, కార్యకర్తలు



వేధింపుల పర్వం
మరో అంకం

- పోలీసుల అదుపులో వైఎస్సార్ సీపీ కార్యకర్త
- మహిళా పోలీస్ సిబ్బందిని తోశారని ఆరోపణ
- ఫిర్యాదు లేకుండానే అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం
- ఎందుకు అదుపులోకి తీసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండ్
- ఎంతకీ వదలకపోవడంతో స్టేషన్ ఎదుట మాజీ మంత్రి బైఠాయింపు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వ వేధింపుల పర్వం కొనసాగుతోంది. కల్తీ మద్యంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసనలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా సోమవారం పలాస-కాశీబుగ్గలో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ కన్వీనర్ డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. పెద్ద ఎత్తున నాయకులు, మహిళలు హాజరు కావడంతో అధికార నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఈ నిరసనలో వేణుగోపాల్ రెడ్డి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త.. మహిళా పోలీసును తోసేశారంటూ ఓ పస లేని ఆరోపణను తెరపైకి తెచ్చారు. మంగళవారం సాయంత్రం టౌన్ సీఐ సూర్యనారాయణ.. వేణుగోపాల్ రెడ్డిని స్టేషన్‌కు పిలవడంతో వాతావరణం వేడెక్కింది. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు స్టేషన్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో మాట్లాడారు. ఇంతలోనే వేణుని సెల్‌లో బంధించారు. వేణుగోపాల్‌పై ఎవరు ఫిర్యాదు చేశారు? ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయన్నది పోలీసులు బహిర్గతం చేయడం లేదు. వేణుపై మహిళా పోలీసు ఫిర్యాదు చేయలేదని, ఆమెపై పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదు కోసం ఒత్తిడి చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.



పోలీసులు అక్రమంగా నిర్బంధించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పైల వేణుగోపాల్ రెడ్డి

పెద్ద ఎత్తున పోలీసులు మోహరింపు..

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్టేషన్‌కు వస్తారని పోలీసులు ముందుగానే ఊహించారు. దీంతో కాశీబుగ్గ సబ్ డివిజన్‌తో పాటు పక్కనే ఉన్న టెక్కలి సబ్ డివిజన్‌కు సంబంధించిన ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బందిని కూడా కాశీబుగ్గ టౌన్ స్టేషన్‌లో మోహరించారు. అవసరమైతే లాఠీచార్జి చేయాలని ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే పోలీసులంతా టౌన్ స్టేషన్ బయట ఉంటూ, ఎప్పటికప్పుడు స్థానిక అధికార పార్టీ నాయకులకు పరిస్థితిని చేరవేశారు. దీనిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి.

సీదిరి ఆందోళన..

పార్టీ కార్యకర్త వేణును పోలీసులు టౌన్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు మంగళవారం రాత్రి తన అనుచరులతో ఠాణాకు వెళ్లారు. ఎందుకు వేణుగోపాల్ రెడ్డిని నిర్బంధించారో చెప్పాలని పోలీసులను నిలదీశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న టెక్కలి డీఎస్పీ, కాశీబుగ్గ ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మణరావు అప్పలరాజుతో మాట్లాడారు. మహిళా పోలీసును నెట్టడంపైనే కేసు నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును చూపించాలని మాజీ మంత్రి కోరడంతో పోలీసులు నీళ్లు నమిలారు. ఫిర్యాదు లేకుండా తమ కార్యకర్తను అదుపులోకి ఎందుకు తీసుకున్నారో తమకు తెలుసునని, వీటన్నిటికీ పోలీసులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అప్పలరాజు హెచ్చరించారు.

మహిళా కార్యకర్తలను నెట్టారు

కల్తీ మద్యంపై పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పలువురు మహిళా కార్యకర్తలను కాశీబుగ్గ టౌన్ సీఐ సూర్యనారాయణ, పలువురు పోలీస్ సిబ్బంది ఇష్టారీతిన నెట్టి, తాకరానిచోట తాకారని, వారి పైన కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని మాజీ మంత్రి అప్పలరాజు డిమాండ్ చేశారు. చేయని తప్పును సృష్టించి తమ పార్టీ కార్యకర్తపై అక్రమ కేసు బనాయించడం తగదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలను టౌన్ సీఐ సూర్యనారాయణ నెట్టి వేస్తున్న దృశ్యాలను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. దీనిపై చర్యలు తీసుకోకుంటే తమ పార్టీ అధికారంలోకి వచ్చాక లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న వేణుగోపాల్‌ను విడిచిపెట్టాలని కోరారు. అయినా పోలీసులు వదలలేదు.

పోలీసుల తీరు సరికాదు



"పలాస నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై సీఐ గత 15 నెలలుగా లెక్కలేనన్ని అక్రమ కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే పోలీసులు, అధికార యంత్రాంగం ఈ చర్యలకు పాల్పడుతున్నారు. ఈ అంశంపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదు. ఇది సరికాదు. మేము రాజకీయాల్లోకి వచ్చింది సేవ చేయడానికి మాత్రమే. నేను రాజకీయాల్లో ఉండొచ్చు లేకపోవచ్చు.. కానీ ఇలాంటి సీఐలను మాత్రం విడిచిపెట్టకూడదు. జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి తీరును తీవ్రంగా ఖండిస్తున్నా."

-మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



కార్యకర్త అక్రమ నిర్బంధంపై సీఐని ప్రశ్నిస్తున్న సీదిరి అప్పలరాజు



సీఐ తీరుకు నిరసనగా పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన పాత్రికేయులు



స్టేషన్ బయట పార్టీ శ్రేణులు

స్టేషన్ ఎదుట బైఠాయింపు

పోలీసుల తీరుకు నిరసనగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన అనుచరులతో కలిసి స్టేషన్ ఎదుట బైఠాయించారు. తమ కార్యకర్తను విడిచి పెట్టేవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని నిరసనకు దిగారు. రాత్రి 12 గంటలు దాటినా నిరసన కొనసాగించారు.

మీడియాకు నో ఎంట్రీ

స్టేషన్ వద్ద గొడవ జరుగుతోందని మీడియా ప్రతినిధులు స్టేషన్‌లోనికి వచ్చేందుకు ప్రయత్నించగా టౌన్ సీఐ సూర్యనారాయణ తన ప్రతాపం చూపారు. మీడియా ప్రతినిధులు స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో మీడియా ప్రతినిధులంతా కాశీబుగ్గ టౌన్ స్టేషన్ ఆవరణలో ధర్నాకు దిగారు. పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమను సీఐ సూర్యనారాయణ స్టేషన్‌లోకి అనుమతించకపోగా, దుర్భాషలాడటం తగదని వాపోయారు.



స్టేషన్ లోపల సీఐ సూర్యనారాయణను ప్రశ్నిస్తున్న సీదిరి అప్పలరాజు

ముమ్మాటికీ వైఎస్ జగనే ▸ కిడ్నీ బాధితుల బాంధవుడు

- పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ఘనత పూర్తిగా ఆయనదే
- విద్య, వైద్య రంగాలకు వైఎస్ జగన్ ప్రాధాన్యం
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని ప్రైవేటు హోటల్‌లో ధర్మాన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అనేక దశాబ్దాలుగా ఏ ఒక్కరూ శాశ్వత పరిష్కారం ఆలోచన చేయలేదని, ఉద్దానం కిడ్నీ సమస్యను అన్ని రాజకీయ పార్టీలు వాడుకుని లబ్ధి పొందాయే కానీ, సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కారం కోసం ఏ ప్రభుత్వాలు ప్రయత్నించలేకపోయాయని ధర్మాన తెలిపారు. వైఎస్ జగన్ మొదటిసారి సీఎం అయినా కూడా సమస్యను అర్థం చేసుకుని వంద కోట్లతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. తానే భూమి పూజ చేసి ప్రారంభించి, నిర్మాణం చేసి, ఆస్పత్రిని ప్రారంభించడం వైఎస్ జగన్ ఘనత అన్నారు. భూగర్భ జలాలు తాగడం వల్లే కిడ్నీ సమస్య వస్తుందన్న వైద్యుల సూచనతో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ.800 కోట్లతో హిరమండలం రిజర్వాయర్ నుంచి నీరు తీసుకొచ్చారని తెలిపారు. దివంగత వైఎస్సార్ కూడా ఉచిత విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పించారని, ఆయన తనయుడు మరో పదడుగులు ముందుకేసి మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టి 5 మెడికల్ కాలేజీలు పూర్తి చేశారని చెప్పారు. మిగిలిన వాటిని ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు ఆలోచన చేయడం సరికాదన్నారు. పీపీపీ విధానాన్ని కట్టిపెట్టి ఉచిత వైద్యవిద్యకు కట్టుబడి ఉండాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగాలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో శత్రువులైనా అంగీకరించక తప్పదన్నారు. నాడు-నేడు ద్వారా కొత్త పీహెచ్‌సీల నిర్మాణం, పాత ఆస్పత్రుల ఆధునికీకరణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఆరోగ్య ఆసరా, గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం వంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రైవేటుకు అప్పగిస్తే జనం ప్రాణాలకు డబ్బుతో విలువ కడతారని అన్నారు. శవాలకి సైతం వైద్యం చేసి డబ్బులు దోచుకుంటున్న పరిస్థితులు ఇప్పుడున్నాయన్నారు. ఓ నిరుపేద కుటుంబానికి అనారోగ్యం వస్తే ఆయన జీవితకాలంలో సంపాదించినసొమ్ముతో పాటు ఆస్తుల్నికోల్పోయి రోడ్డున పడుతున్నారన్నారు. అలాంటి పరిస్థితి లేకుండా ఉండేందుకే ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని వివరించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి పేద ప్రజల ఆరోగ్యాలు అవసరం లేదని కేవలం కార్పోరేట్లకు దోచిపెట్టడమే వారికి తెలిసిన పాలన అని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే పేదోడి గొంతుకై వైఎస్సార్‌సీపీ ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

నకిలీ రబ్బర్ స్టాంపుల కుంభకోణంలో
ఇద్దరికి రిమాండ్

- ప్రింటర్ ద్వారా దొంగనోట్లు చెలామణీ చేసిన శివకుమార్‌దే కీలక పాత్ర
- తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శుల ఫోర్జరీ సంతకాలు వాడిన వైనం
- వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి 20 మందికి లోన్లు వాడినట్టు గుర్తించిన పోలీసులు



శ్రీకాకుళం క్రైమ్ : ప్రింటర్ ద్వారా నకిలీ నోట్లను తయారు చేసి చెలామణీ చేసిన తంపటాపల్లి శివకుమార్ మరో కుంభకోణంలోనూ సూత్రధారుడయ్యాడు. వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో దాదాపు 20 మందికి నకిలీ రబ్బరు స్టాంపులను ఉపయోగించి దాదాపు రూ. 5 కోట్ల మేర రుణాలను ఇప్పించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి స్టాంపులు తయారు చేసిన ఇద్దరిని మంగళవారం రాత్రి శ్రీకాకుళం సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి అంపోలు జైలుకు రిమాండ్‌కు తరలించారు. జిల్లాకేంద్రంలోని గాంధీపార్కు సమీపంలో ఓ దుకాణం నడుపుతున్న కోసూరు భీమేశ్వరరావు, మామిడి కామేశ్వరావులే నకిలీ రబ్బరు స్టాంపులు తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. జిల్లాలోని వివిధ బ్యాంకులకు, ఫైనాన్స్ సంస్థలకు ప్రైవేట్ కన్సల్టెన్సీగా ఉన్న శివకుమారే వీరి చేత ఆ పని చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. విచారణ ఇంకా ముగియలేదని, చేయాల్సి ఉందని సీసీఎస్ సీఐ చంద్రమౌళి అన్నారు. వివరాల్లోకి వెళ్తే..


ఇక్కడ దొరికారు..

ఈ ఏడాది ఆగస్టులో ఎచ్చెర్లలో నివసిస్తున్న తంపటాపల్లి శివకుమార్‌తో పాటు సోంపేటకు చెందిన బూరగాపు శ్రీనివాస్‌లు జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జిలో రూ.100, రూ.200 నకిలీ నోట్లను మార్చే క్రమంలో సీసీఎస్ సీఐ చంద్రమౌళి బృందానికి పట్టుబడ్డారు. దాదాపు 10, 15 రోజులుగా ఆ లాడ్జిలో మరికొందరితో కలసి వీరు తిష్టవేసినట్లు ఎస్పీ మహేశ్వరరెడ్డికి స్పష్టమైన సమాచారం రావడంతో కేసును సీరియస్‌గా తీసుకున్నారు. పూర్తిగా సీసీఎస్ సీఐ చంద్రమౌళికే కేసు బాధ్యత అప్పగించారు. సీసీ ఫుటేజీ, సీడీఆర్, టవర్ డంప్ కాల్స్, ఇతర సాంకేతిక ఆధారాల సాయంతో అనేక విషయాలు వెలుగులోకి రావడంతో అదే నెల 21న శివకుమార్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

ఇంటికెళ్లి చూడగా..

ఎచ్చెర్ల నవభారత్ జంక్షన్ హైవే పై రాముదాబా సమీపంలో ఉన్న శివకుమార్ ఇంటికెళ్లి చూడగా కట్టకట్టలుగా నకిలీ రబ్బరు స్టాంపులు, డాక్యుమెంట్లు సుమారు 500 నుంచి 600 వరకు ఉండటం గుర్తించారు. ఇదేదో పెద్ద కుంభకోణమే అని అప్పుడే నిర్ధారించారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శులే కాక చాలావరకు ఉమ్మడి జిల్లాలోని నరసన్నపేట, రాజాం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, సరుబుజ్జిలి, జలుమూరు, కోటబొమ్మాళి, పాతపట్నం ఒకటేమిటి అనేక ప్రాంతాల అధికారుల సంతకాలుండే రబ్బరు స్టాంపులు దర్శనమివ్వడంతో షాక్ అయ్యారు. డాక్యుమెంట్లు అన్నీ పరిశీలించాక పూర్తి ఆధారాలతో 20 లోన్లు వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి పొందినట్లు డాక్యుమెంట్లు దొరికాయి. శ్రీకాకుళం గుజరాతీపేట దత్తాత్రేయ ఆశ్రమం సమీప హెచ్‌డీఎఫ్‌సీ, డేఅండ్‌నైట్ టీవీఎస్ సమీప మహేంద్ర ఫైనాన్స్, పూజ మార్బుల్ ఎదురుగా ఎల్‌ఐసీ బ్రాంచి నుంచి లోన్లు తీసుకున్నట్లు తెలిసింది.

టీచర్లు, పోలీసులే ఎక్కువ..



ఫేక్ లోన్లు పొందిన వారిలో ఎక్కువగా టీచర్లు, పోలీసులే ఉన్నారు. వీరంతా గతంలో హౌసింగ్ లోన్ కోసం వివిధ బ్యాంకులు చుట్టూ తిరిగి మంజూరుకానివారే. శివకుమార్ కన్సల్టెన్సీగా ఉండటం.. అందునా అతని తండ్రి రిటైర్డ్ ఏఆర్ ఎస్‌ఐగా ఉండటంతో నమ్మారు. శివకుమార్ సైతం వారి నుంచి ఒరిజినల్ సేల్ డీడ్ తప్ప మిగతా లింక్ డాక్యుమెంట్లు, అడంగల్, 1బీ, ఇంటి పన్ను ఒకటేమిటి అన్ని ఫోర్జరీ సంతకాలతో అధికారుల రబ్బరు స్టాంపులను దుర్వినియోగపర్చి చేశాడు. వాస్తవానికి కొన్ని బ్యాంకులు సుడా పర్మిషన్, నాలా పర్మిషన్ లేనిదే లోన్ ఇవ్వవు. ఇవి వర్తించని బ్యాంకులను గుర్తించి పని చేసుకున్నారు. రెవెన్యూ విభాగం నుంచి కూడా రిజిస్ట్రేషన్ అయిన వాటికే లింక్ డాక్యుమెంట్లు, ఇతరత్రా సంతకాలు చేస్తారు. ఐదారేళ్లుగా జరుగుతున్న ఈ కుంభకోణంలో బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల పాత్ర ఏంటి..? సంతకాల ఫోర్జరీపై ఆ విభాగాల అధికారులు సైలెంట్‌గా ఉండటం ఏంటన్నది తెలియాల్సి ఉంది.

ఓడీల కోసం పాట్లు

- ఇంకా అందని డిగ్రీ ఓడీలు
- పైచదువులకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



వర్సిటీ ఎగ్జామినేషన్ బ్లాక్ వద్ద డిగ్రీ సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ డాక్యుమెంట్ల కోసం నానా పాట్లు పడుతున్నారు. వీరు ఉత్తీర్ణత సాధించి నెల దాటినప్పటికీ వీరికి ఇప్పటికీ సర్టిఫికెట్లు అందించలేదు. జిల్లాలో మొత్తం మొత్తం 15 ప్రభుత్వ కళాశాలలు, 84 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలకు సంబంధించి విద్యార్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి పై చదువుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరికి అవసరమైన ప్రొవిజనల్స్, ఓడీ సర్టిఫికెట్లు ఎచ్చెర్ల లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అందిస్తోంది. గతంలో ఏ కళాశాలకు సంబంధించి ఆ కళాశాలకు సర్టిఫికెట్లను పంపించేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లాలోని డిగ్రీ విద్యార్థులంతా వర్సిటీకి వచ్చి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంది. వీరికి ఎలాంటి ఫీజు బకాయిలు లేవని సంబంధిత కళాశాల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకువస్తే వర్సిటీ వారు విద్యార్థికి ప్రొవిజనల్స్, ఓడీ అందిస్తారు. అయితే ఈ ప్రక్రియ జాప్యం కావడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. డిగ్రీ అనంతరం చదవాల్సిన ఏపీ పీజీ-సెట్, లా-సెట్, ఐ-సెట్‌లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ విద్యార్థులు తమ వద్ద సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ వర్సిటీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉచిత వైద్య సేవలు ▸ బంద్

- ప్రైవేటు ఆస్పత్రుల బయట కనిపిస్తున్న ఫ్లెక్సీలు
- ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద రోగులను అనుమతించని 13 ఆస్పత్రులు
- ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శలు



కిమ్స్ ఆస్పత్రికి 'బంద్' ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

అరసవల్లి: జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవలు (ఆరోగ్యశ్రీ) బంద్ అయ్యాయి. ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో ఈనెల 10 నుంచి పూర్తి స్థాయిలో సేవలను నిలిపివేసినట్టుగా ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్య సంఘం (ఆశా) ప్రకటించిన సంగతి విదితమే. ఈ మేరకు మంగళవారం 'సాక్షి' బృందం జిల్లా కేంద్రంలో పలు నెట్‌వర్క్ ఆస్పత్రులు, ముఖ్యమైన కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవల పరిస్థితులను పరిశీలించింది.

- జిల్లాలో 13 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్యసేవలను అమలు చేస్తున్నాయి. ఈ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.147 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. దీంతో ఈ నెల 10 నుంచి ఉచిత వైద్య సేవలన్నీ బంద్‌చేస్తున్నట్లుగా అన్ని ఆస్పత్రుల బయట భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.
- ఇక ఎన్టీఆర్ వైద్య సేవల కియోస్క్‌ల వద్ద సిబ్బంది కూడా విధుల్లో లేకుండా ఆస్పత్రి యాజమాన్యాలు చర్యలకు దిగింది. దీంతో కియోస్క్‌ల వద్ద రోగులెవ్వరూ కనిపించలేదు.
- ఉచిత వైద్య సేవల కోసం వస్తున్న రోగులను ఆస్పత్రి గేటులోకి రాకుండానే నిలిపివేసేలా సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.
- అయితే ఎవరైనా ఈ ఉచిత వైద్య సేవల కోసం అడిగితే ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లాలని అక్కడి ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు.
- దీంతో రిమ్స్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలకు రోగులు పరుగులు పెడుతున్నారు. దీంతో ఎమర్జెన్సీ కేసులైనప్పటికీ గత నాలుగు రోజుల నుంచి ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఒక్క ఆపరేషన్ కేసును టేకప్ చేయలేదని ఓ వైద్యుడు చెబుతున్నారు.
- అలాగే ఈ నెల 10వ తేదీకి ముందు ఉచిత వైద్య సేవలు (ఆరోగ్యశ్రీ) పొందిన రోగులకు మాత్రం యథావిధిగా చికిత్సను అందించడం కనిపించింది.
- అలాగే ఎమర్జెన్సీ కేసుల విషయంలో కూడా నెట్‌వర్క్ ఆస్పత్రులు గట్టిగానే నిరసన వ్యక్తం చేసేలా ప్రవర్తిస్తున్నాయి. మంగళవారం ఉదయం వచ్చిన ఓ ప్రమాద కేసును ఓ కార్పోరేట్ ఆస్పత్రిలో ఉచితసేవలకు అనుమతించకుండా డబ్బులిస్తే చేర్చుకుంటామని చెప్పి శస్త్ర చికిత్స చేశారని తెలిసింది.
- మంగళవారం ఉదయం మరో కేసును కూడా రిమ్స్‌కు తరలించేశారు.
- జిల్లాలో గ్రామాల్లో ఉన్న ఆర్‌ఎంపి ప్రైవేటు వైద్యులకు వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం ఇచ్చి ఎన్టీఆర్ వైద్య సేవలు చేయడం లేదని, ఎవర్నీ పంపించొద్దంటూ మెసేజిలు పంపించారనే చర్చ జరుగుతోంది.
- ఎలాగైనా ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి బీమా పథకానికి లింక్ చేసి తద్వారా ప్రైవేటు సేవలుగా మార్చాలనే ప్రస్తుత కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలువురు రోగులు బాహాటంగా విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి


పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నందిగాం: మండల పరిధిలోని కవిటి అగ్రహారం వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పలాస రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పలాస మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేతిపై ఇంగ్లిష్‌లో సుశాంత అని పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్పీ పోలీసులను సంప్రదించాలన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రిమ్స్‌లో ధర్మారావు మృతదేహం

పాతపట్నం: గంగువాడ గ్రామానికి చెందిన రావలవలస ధర్మారావు(52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.ఎస్‌ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారావు ఈ నెల 12న మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య నిలదీసింది. దీంతో మనస్తాపం చెందిన ధర్మారావు పంట పొలాలకు కొట్టే పురుగుల మందును తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి


సజ్జల రామకృష్ణారెడ్డితో జిల్లాకు చెందిన పరిశీలకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో అనుబంధ విభాగాల నియామకం త్వరితగతిన చేపట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ, పాతపట్నం నియోజకవర్గ పరిశీలకుడు పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిశీలకుడు కరిమి రాజేశ్వరరావు, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిశీలకుడు దుంపల లక్ష్మణరావు, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల పరిశీలకుడు శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో నాయకులను, పార్టీ కార్యకర్తల్ని సమన్వయపరచాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ సేవలను ప్రజల గుమ్మం దాకా చేరవేయడమే తమ ప్రధాన ధ్యేయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ, పీజీఆర్‌ఎస్ వంటి రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు, కోర్టు కేసులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 18లోగా ఈ పంట వివరాల నమోదు ప్రక్రియ నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో లక్ష్యాన్ని చేరుకున్న లావేరు మండల బృందాన్ని అభినందించారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద 11 గ్రామాలు ఎంపికయ్యాయని వాటిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన వాహనాల గురించి ఆరా తీశారు. వారంలోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిమాండ్ ఉన్న చోట్ల ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ చెప్పారు.

అంగన్‌వాడీలపై.. బిల్లుల భారం!

- 2022 ధరలకు అనుగుణంగానే నేటికీ బిల్లుల చెల్లింపు
- మూడురెట్లు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు
- నిర్వహణ కష్టమంటున్న కార్యకర్తలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


యంబరాం అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు


సుభలయ అంగన్‌వాడీ కేంద్రం

హిరమండలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వీర్యమవుతున్నాయి. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచుతామని పాలకులు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ బిల్లులు పెంచకపోవడంతో కేంద్రాల నిర్వహణ ఖర్చులు కార్యకర్తలకు భారంగా మారాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న జీతాలకు తోడు పాత ధరలు ఆధారంగా బిల్లులు చెల్లిస్తుండటంతో వంట ఖర్చులకు ఇబ్బందులు తప్పడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగైతే కష్టమే..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ పిల్లల ఆహారం కోసం కూరగాయలు, ఆకుకూరలు, పసుపు, చింతపండు, కారంపొడి తదితర సామగ్రి ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలి. వీటి కొనుగోలుకు ఒక చిన్నారికి నెలకు రూ.50 చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇది ఏమాత్రం సరిపోడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు ఒకరికి కూరగాయలు, పోపులకు రూ.1.50, గ్యాస్ నెలకు రూ.450 చొప్పున ఇస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.950కు పెరిగింది. ప్రస్తుతం పెరిగిన ధరలకు కారణంగా మెనూ ప్రకారం వండి పెట్టాలంటే అదనపు భారం తప్పడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

బిల్లులు పెంచాలి..

2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగా ప్రస్తుతం బిల్లులు చెల్లిస్తున్నారు. ఓవైపు నిత్యావసర సరుకుల ధరలు మూడు రెట్లు పెరగడంతో పాటు గ్యాస్ ధర కూడా బిల్లు చెల్లించిన దాని కంటే అదనంగా రూ.500 పెరిగింది. మెనూ ప్రకారం వండిపెట్టాలంటే తమకు భారంగా ఉందని, ప్రస్తుత ధరలు ప్రకారం బిల్లులు చెల్లించాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

మెనూ ఇలా	
సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	టమోటా పప్పు
బుధవారం	ఆకు కూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	బీరకాయ/సొరకాయ పప్పు
శనివారం	వెజిటబుల్ బాత్‌రైస్

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
16	3385	10168	8292	38900

ఉన్నతాధికారులకు నివేదించాం..



కొత్త ధరల ప్రకారం బిల్లులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కొత్తబిల్లులు చెల్లింపునకు చర్యలు చేపడతాం.

– ఉమా జానకి, ఐసీడీఎస్ సీడీపీఓ, కొత్తూరు

ప్రైవేటీకరణ కుట్రలు అడ్డుకోండి


తామాడలో కోటి సంతకాల సేకరణ ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, పరిశీలకుడు కె.వి.జి.సత్యనారాయణ తదితరులు

రణస్థలం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల మహా ఉద్యమం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో లావేరు మండలం తామాడ గ్రామంలో మంగళవారం రచ్చబండ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య, వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ గొప్ప ఆశయానికి తూట్లు పొడిచి, వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు తెర వెనుక ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉచిత విద్యుత్ మొదలుకొని అమ్మ ఒడి వరకు కూటమి ప్రభుత్వం అన్నింటినీ రద్దు చేసే కుట్ర చేస్తోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా సంతకాల సేకరణలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు కె.వి.జి.సత్యనారాయణ, లావేరు మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, వ్యవసాయ సలహా మండలి కార్యవర్గ సభ్యులు గొర్లె అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం దివ్యాంగుల ఆవేదన


మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముందు వాపోతున్న కళావతి

కొత్తూరు: మెట్టూరు బిట్–2 ఆర్‌ఆర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో కాలనీకి చెందిన ఇద్దరు దివ్యాంగులు తమ గోడు వెల్లబోసుకున్నారు. పింఛన్లు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ద్వారా ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా పింఛన్ అందడం లేదని పొలుమూరు కళావతి, కలగాపు ఆరుద్రమ్మ వాపోయారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నందిగాం: నర్సిపురం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందింది. ఆదివారం రాత్రి ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. వీరిని 108 వాహనం, నేషనల్ హైవే అంబులెన్స్‌లలో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అందులో ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పిట్ట రాధమ్మ(60) మంగళవారం మృతి చెందింది. ఈమె స్వస్థలం ఇచ్ఛాపురం మండలం ధర్మపురం. ఒడిశా రాష్ట్రం రాయగడలో మజ్జి గౌరమ్మని దర్శనం చేసుకొని తిరిగి గ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

కొట్లాట ఘటనలో జరిమానా

వజ్రపుకొత్తూరు రూరల్: ఒంకులూరు గ్రామంలో 2016లో ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాట ఘటనపై అదే గ్రామానికి చెందిన బడే సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై పలాస సివిల్ జ్యుడీషియల్ కోర్టులో వాదప్రతివాదనలు జరిగాయి. ఈ మేరకు ముద్దాయిలైన దాసరి ధనలక్ష్మీ, సండుపల్లి సావిత్రిలకు రూ.1000 జరిమానా విధించింది. జరిమాన కట్టకపోతే 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు కోర్టు తీర్పు విధించింది. ప్రధాన నిందుతుడు దాసరి ప్రదీప్‌పై తీర్పు పెండింగ్‌లో ఉన్నట్లు ఎస్సై బి.నిహార్ తెలిపారు.

'ఎదుగుదల ఓర్వలేకే నిందలు'

ఇచ్ఛాపురం: రాజకీయంగా తన ఎదుగుదల చూడలేకే కొంతమంది కూటమి నేతల సహకారంతో వ్యక్తిగతంగా నిందారోపణలు చేస్తున్నారని ఇచ్ఛాపురం జనసేనపార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు, మామయ్యకు మధ్య పెనుగులాట మాత్రమే జరిగిందని, తాను ఎవరిపైనా దాడిచేయలేదని స్పష్టం చేశారు.

సమాజ సేవకు.. నేను సైతం



- నేషనల్ యూత్ వలంటీర్లగా పనిచేసేందుకు ఆహ్వానం
- ఎంపికైతే పారితోషికం
- దరఖాస్తులకు నేడే ఆఖరు తేది

శ్రీకాకుళం న్యూకాలనీ: సమాజంలో కోసం ఏదైనా మంచి పని చేయాలని ఉందా ? సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే ఆసక్తి ఉందా ? అయితే కేంద్ర ప్రభుత్వం మీకు చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. నేషనల్ యూత్ వలంటీర్‌గా సమాజ సేవ చేసేందుకు ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఒకవైపు సేవ చేస్తూనే మరోవైపు ప్రతినెలా పారితోషికాన్ని పొందవచ్చు. అక్టోబర్ 15లోగా 'ఎన్‌వైకెఎస్.ఎన్‌ఐసీ.ఇన్' వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా..

దరఖాస్తుదారులకు శ్రీకాకుళం జిల్లాలోని మేరా యువభారత్ (నెహ్రూ యువకేంద్రం) కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థుల వయస్సు అక్టోబర్ ఒకటి నాటికి 18 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలి. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగినవారు అర్హులు. డిగ్రీ అర్హతను కలిగి కంప్యూటర్ అప్లికేషన్స్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు, ఈ–బ్యాంకింగ్, డిజిటల్ వంటి వివిధ యాప్‌లలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. మై భారత్ అనుబంధ యువజన సంఘాల సభ్యులు, మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వివరాలకు 08942–222028, 9133095646 నంబర్లను సంప్రదించవచ్చు.

ఎంపికైతే స్టైఫండ్ ఇలా..

వలంటీరుగా ఎంపికైనవారు ఏడాది కాలం పనిచేయాల్సి ఉంటుంది. ఎంపికై నవారికి నెలకు రూ.5వేల స్టైఫండ్ చెల్లిస్తారు.

విధులు ఇలా..

వలంటీర్లకు ప్రత్యేకంగా బ్లాకులను కేటాయిస్తారు. రెండు మండలాలను కలిపి ఒక బ్లాక్‌గా గుర్తిస్తారు. వలంటీర్లు యువజన, మహిళా సంఘాలను స్థాపించడం, సంఘాలను సమన్వయం చేసుకుని క్రీడలు, ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుద్ధ్యం, పచ్చదనం–పరిశుభ్రత, మహిళా సాధికారిత, లింగవివక్ష, ఇతర సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరచడం, తదితర అంశాలో ప్రగతి సాధన కోసం పనిచేయాల్సి ఉంటుంది.

సువర్ణావకాశం



సమాజ సేవ చేయాలన్న ఆసక్తి కలిగినవారు మాత్రమే దరఖాస్తులు చేయండి. ఎంపికై నవారు తమకు అప్పగించిన బ్లాకుల్లో సామాజిక, చైతన్య కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. బుధవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలి.

– కె.వెంకట్ ఉజ్వల్, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాకుళం

భరతజాతి ముద్దుబిడ్డ అంబేడ్కర్


పాలవలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: భరతజాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ, రాజ్యాంగా సృష్టికర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం అన్నారు. పాలవలసలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అనంతరం దంతపురి బౌద్ధక్షేత్రంలో 69వ దమ్మదీక్ష దినోత్సవ బౌద్ధ సమ్మేళనంలో స్పీకర్ పాల్గొన్నారు. బుద్ధుడి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియన్ మిషన్ రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు కంఠ వేణు, తైక్వాండో శ్రీను, పీఎస్ఎన్ మూర్తి, కె.కె.రాజా, బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, సామాజిక పోరాట సమితి అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, గొల్లపల్లి సురేష్, యడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల సూర్యప్రకాశరావు, కొంచాడ సూర్యనారాయణ,గొల్లపల్లి నందేష్., బొత్స వెంకటరమణ పాల్గొన్నారు.

బురద నీరే.. తాగునీరు



కళింగపట్నం పంచాయతీ నగరాలపేట ఎస్సీ కాలనీలో బురద నీరు సరఫరా కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం గార వద్దనున్న రక్షిత పథకం నుంచి నీరు సరఫరా కాగా బురదనీరే వచ్చింది. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

– గార



గంజాయితో ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 30 కేజీల గంజాయితో ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. రైల్వేస్టేషన్ తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన అంబరేష్, ఆర్. వెంకటసాయిలు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు. బ్యాగ్‌లో 29.150 కేజీల గంజాయిని గుర్తించారు. వీరు ఒడిశాలోని ఖనుచరణ్ వద్ద నుంచి గంజాయిని కొనుగోలుచేసి బళ్లారిలో గంజాయి వ్యాపారం చేస్తున్న రాముకి ఇచ్చేందుకు బరంపురం రైల్వేస్టేషన్ చేరుకున్నారు. అక్కడ పోలీసులు తనిఖీలు ఎక్కువగా ఉండగా బస్సు ద్వారా ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఇక్కడి రైల్వేస్టేషన్‌కి వెళ్తుండగా పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ వి.రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుపుల సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్‌లు వద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్ చేయకూడదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. గ్రానైట్ యాజమాన్యాలతో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రానైట్ ఇండస్ట్రీలో భద్రత, రక్షణ ముఖ్యమన్నారు. కార్మికుల భవిష్యత్‌కు భరోసాగా గ్రూపు ఇన్సూరెన్సు ఉండాలన్నారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. గ్రానైట్ ఇండస్ట్రీస్‌పై ట్రెనింగ్ సెంటర్‌కు భూమి కేటాయిస్తానన్నారు. ఈఎస్‌ఐలో ఉంటే అంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కలెక్టర్‌కు వివరించారు. ఈఎస్‌ఐ పెట్టుకునేందుకు డిసెంబర్ 31 వరకు సమయం ఉన్నట్టు చెప్పారు. గ్రానైట్ కార్మికుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటుకు 10 సెంట్లు భూమి కావాలని గ్రానైట్ అసోసియేషన్ కోరగా భూమి ఇవ్వాలని టెక్కలి ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. లైసెన్సులు లేని క్రషర్స్ ఉంటే ఆపివేయాలన్నారు. వాతావరణ కేంద్రం జారీ చేసిన వాతావరణ పరిస్థితుల ఆధారంగా తక్షణమే సైరన్ వేయాలని చెప్పారు.

భూ గర్భ గనుల శాఖ ఉప సంచాలకులు మోహనరావు మాట్లాడుతూ గ్రానైట్ కార్మికులకు కార్మిక శాఖ బీమా కల్పించాలని, అన్ని అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. గుర్తింపు పొందిన లైసెన్సు ఉన్న వారితోనే బ్లాస్టింగ్ చేయించాలన్నారు. బ్లాస్టింగ్ చేసే ముందు పోలీస్ వారికి, తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లాలోని క్వారీల యజమానులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణ శ్రీ, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మోహనరావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్, శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్డీఓలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డీఎస్పీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ మిగులు సీట్లలో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్ల భర్తీకి ఐదో విడత నోటిఫికేషన్ విడుదలైందని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకరరావు మంగళవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్'లో ఈ నెల 16లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 17న కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.